

ప్రారంభానికి నోచుకోని ఎంఈఓ భవనం

నత్తనడకన పనులు

ఐదేళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల విద్యాధికారి కార్యాలయం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ భవనం చుట్టూ ప్రహరి నిర్మించలేదు. దీంతో భవనం గోడలకు పగుళ్లు వస్తున్నాయి. కార్యాలయం ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ విషయమై మండల విద్యాధికారి వెంకట్ నర్సింహులును వివరణ కోరగా భవన నిర్మాణం పూర్తయింది. నీటి వసతి కోసం బోరుమోటారు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రహరీ పూర్తికాగానే భవనాన్ని ప్రారంభిస్తామని సమాధానమిచ్చారు.

– కంది(సంగారెడ్డి)



రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తచెదారం

రోడ్డా.. డంపింగ్ యార్డా?

భారతినగర్ డివిజన్ బీడీఎల్ కాలనీ నుంచి ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ వెళ్లే మార్గం చెత్త డంపింగ్ యార్డ్‌గా మారుతోంది. ఈ రోడ్డు బీహెచ్ఈఎల్ యాజమాన్యానికి చెందింది కావడంతో జీహెచ్ఎంసీ అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. చెత్త కారణంగా పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. చెత్తను తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారుల వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



పొట్టిపల్లి గ్రామ శివారులోని రోడ్డుపై ఉన్న కంకరకుప్పలు

తవ్వారు.. వదిలేశారు..

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని ఎల్గోయి గ్రామం నుంచి పొట్టిపల్లి గ్రామం మీదుగా జహీరాబాద్ మండల పరిధిలోని అల్గోల్ గ్రామం వరకు రోడ్డు నిర్మించేందుకు రోడ్డును పూర్తిగా తవ్వేసి కంకర కుప్పలు పోసి చదును చేయడం మరిచారు. రాత్రి సమయాల్లో వాహనాలు కంకర కుప్పలపైకి వెళ్లి అదుపుతప్పి కిందపడిన సందర్భాలు అనేకం ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– ఝరాసంగం(జహీరాబాద్)

క్లుప్తంగా

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

పటాన్‌చెరు: బెల్ట్‌షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడెంలో జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం దాడులు నిర్వహించి రూ.15వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోండి

వట్‌పల్లి(అందోల్): గ్రూపు–2 పరీక్ష వాయిదా పడిందని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న అభ్యర్థిని ప్రవళిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రొళ్ల మహేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోటీ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడంలో టీఎస్‌పీఎస్సీ పూర్తిగా విఫలమైందన్నారు. దీంతో అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



చేపపిల్లలను వదులుతున్న నాయకులు

రాయికోడ్(అందోల్): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. మండలంలోని సింగితం గ్రామ శివారులో హనుమండ్ల వాగు చెరువులో ఏఐఎఫ్ (అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీష్) రంగానాయక్ సమక్షంలో శనివారం 90వేల చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు విఠల్, మత్స్యకారుల సంఘం నాయకులు, సభ్యులు రవికుమార్, గురువీర్, ప్రశాంత్, అంజయ్య, బక్కన్న, జనార్దన్, ప్రవీణ్, గోపాల్, విష్ణు, వెంకట్, నవీన్ పాల్గొన్నారు.

తపాల సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సంపత్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): తపాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి డివిజన్ తపాలాశాఖ అధికారి సంపత్‌రెడ్డి అన్నారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా గుమ్మడిదల గ్రామంలో శనివారం తపాల సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ పోస్టర్ వీక్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. పోస్టల్‌శాఖలో అందుబాటులో ఉన్న ప్రత్యేక పాలసీల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫరీదుద్దీన్‌కు నివాళి



ఫరీదుద్దీన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు

జహీరాబాద్: దివంగత మాజీ మంత్రి ఫరీదుద్దీన్ జయంతిని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, ఐడీసీ చైర్మన్ తన్వీర్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నీలం మధు ముదిరాజ్ పాదయాత్రకు ఏర్పాట్లు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామం నుంచి ఎన్నికల పాదయాత్రను ప్రారంభించనున్నట్లు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ప్రకటించారు. పాదయాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ఎన్ఎంఆర్ యువసేన నాయకులు గ్యారాల మల్లేశ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. పాదయాత్రతో మండలంలోని అన్ని గ్రామాల్లో నీలం మధుకు మద్దతు పెరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

'ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికే మా మద్దతు'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికే తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని రామచంద్రపురం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ మేరకు డివిజన్ పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో యూనియన్ సభ్యులందరూ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెయింటింగ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, ఎన్నికల అనంతరం వర్కర్స్ యూనియన్ భవనం నిర్మిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన యూనియన్ సభ్యులు

ఆదర్శ్‌రెడ్డి, సర్కిల్ అధ్యక్షులు పరమేష్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కుమార్‌గౌడ్, ఐలేష్ యాదవ్, అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు బాలప్ప, కుద్భుద్దిన్, రఫీ, శ్రీనివాస్ నగేష్, భాగయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. వట్‌పల్లికి చెందిన మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ బొండ బొల్ల ధన్వేందర్‌రావు, దేవునూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు షరీఫ్ మియా ఎమ్మెల్యే సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు కుతొబ్దీన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మధు, నాయకులు మొయొద్దీన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

అలంకారప్రాయం.. అతిథి గృహం

- ప్రారంభించిన వారం రోజులకే తాళం
- ఏడేళ్లు గడుస్తున్నా వినియోగానికి నోచుకోని దుస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఐబీ అతిథి గృహం

హత్నూర(సంగారెడ్డి): అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం మూలంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఐబీ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. భవనం నిర్మించి ఏడేళ్లు గడుస్తున్నా వినియోగానికి నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తోందని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి పారుదలశాఖ రూ.27లక్షలు వెచ్చించి నిర్మించిన అతిథిగృహాన్ని అప్పటి మంత్రి, ప్రస్తుత రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి 2014 ఫిబ్రవరి 13న చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ.. ఫర్నీచర్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రారంభించిన వారం రోజులకే తాళం పడింది. ఆతర్వాత భవనం గురించి పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. అధికారుల నిర్లక్ష్యంతో అతిథిగృహానికి ఉన్న తలుపులు, కిటికీలు చోరీకి గురికావడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా చేశారు



లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన అతిథిగృహం వినియోగానికి నోచుకోకపోవడం విచారకరం. ఆర్భాటంగా నిర్మించి అంతలోనే మరిచిపోయారు. కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

– నవీన్‌గౌడ్, స్థానికుడు, మధుర

వినియోగంలోకి తేవాలి



లక్షల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన అతిథిగృహం ఏడేళ్లుగా వినియోగానికి నోచుకోకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫర్నీచర్, ఇతర సౌకర్యాలను కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

– ప్రశాంత్‌చారి, స్థానికుడు, హత్నూర

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఉత్సవాలు



జిన్నారం: అన్నారంలో బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు, చిన్నారులు

జిల్లావ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు, చిన్నారులు బతుకమ్మల చుట్టూ ఆడి పాడుతూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



పటాన్‌చెరు: గోనెమ్మ ఆలయ ఆవరణలో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు



సంగారెడ్డి: 7వ వార్డు కల్వకుంటలో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సంగారెడ్డి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. చౌటకూర్ మండలంలోని బొమ్మారెడ్డిగూడెంలో వెలసిన భవానీసేవాలాల్ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

'ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం'

సంగారెడ్డి అర్బన్: గ్రూపు–2 పరీక్ష వాయిదా పడిందని మనస్తాపానికి గురై హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమేష్, మహేష్ డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సంఘం కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సిద్ధేశ్వర ఆలయంలో పూజలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సిద్దేశ్వర ఆలయంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం శనిఅమవాస్యను పురస్కరించుకొని సిద్ధేశ్వర, శనీశ్వరస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మాణిక్‌ప్రభుగౌడ్, ప్రశాంత్‌పాటిల్, గోపాల్, గాల్‌రెడ్డి, నర్సింహులు, చెంగల్ జైపాల్, శివకుమార్, బాల్‌రాజ్, పవన్, రాంశెట్టి ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వట్‌పల్లి(అందోల్): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అరెస్టు చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఒక హోటల్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.1,650 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శనీశ్వరుడికి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలోని శనీశ్వరాలయం, ఏడాకులపల్లి గ్రామంలోని సప్తపురి శనిఘాట్ ఆలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్ వేరువేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆర్టీసీ ప్రయాణం సురక్షితం'

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ మెకానిక్, డ్రైవర్లు, శ్రామికులకు శనివారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఉపేందర్ మాట్లాడుతూ ఆర్టీసీకి మరింత అభివృద్ధి కృషి చేయాలని సూచించారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని దుర్గ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి చింతా ప్రభాకర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఆకుల శివకుమార్, పిల్లోడి విశ్వనాథం, చౌదరి ప్రకాష్, నల్ల శివలక్ష్మి, కోఆప్షన్ మెంబర్ అంజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చిలమల్లన్న, మాజీ అధ్యక్షులు కొత్తగొల్ల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు నస్రిరొద్దిన్, సత్యం గౌడ్, అయుబ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో చింతా ప్రభాకర్

ఘనంగా బుద్ధ దీక్షా దివస్



అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండలం పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో బుద్ధ దీక్షా దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కిషన్‌రావు, సర్పంచ్ అనితయాదగిరి గౌతమ బుద్ధుడు, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగపూర్‌లో లక్షలాదిమందితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచశాంతి కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మీనంపల్లి సదానందం, మచుకూరి శ్రీకాంత్, తాల్క కుమార్, మీనంపల్లి అరుణ్ కుమార్, చీమల సందీప్, సుధాకర్, తరుణ్, సురేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధురెడ్డి కుమారుడు జైవీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా భెల్ టౌన్‌షిప్‌లోని అభిలాష వోకేషనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల కేంద్రంలో అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు యూనిఫాం నిమిత్తం రూ.60వేల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన చేతివృతుల వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఏఆర్ ట్రస్టు చైర్మన్ ఆదర్శ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సరస్వతి, సత్యవతి, వినోద్, సరోజ్, సురేందర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ కుమారుడు జైవీర్‌రెడ్డి